అంధకారంలో చౌరస్తాలు

- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- నగరంలో నెలకొన్న దుస్థితి


నగరంలోని సుభ్‌జిత్ ఫ్యాక్టరీ ముందు ఇటీవల చీకట్లో డివైడర్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం


ముబారక్ నగర్‌లోని రహదారిపై విద్యుత్ లైట్లు లేకపోవడంతో అలుముకున్న చీకటి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పలు ప్రధాన చౌరస్తాలు అంధకారంలో మగ్గుతున్నాయి. రోడ్లపై వీధిదీపాలు లేకపోవడంతో తరచుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినా సౌకర్యాలు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

వాహనాల రద్దీ పెరుగుతున్నా..

నగరంలో నిత్యం వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయి. ప్రధానంగా నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రధాన వాహనాలన్నీ కంఠేశ్వర్ బైపాస్ నుంచి హైదరాబాద్, డిచ్‌పల్లి, కామారెడ్డి వైపు వెళ్తున్నాయి. అంతేగాక నూతనంగా కలెక్టరేట్ ఏర్పాటు కావడంతో బోధన్ రోడ్డు వైపు కూడా రద్దీ పెరిగింది. ఇది కాక ఆర్మూర్, కరీంనగర్, వరంగల్ నిర్మల్, నందిపేట్ వైపు నుంచి వచ్చే వాహనాలతో ఈ చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ నగర పాలకవర్గం మాత్రం ఇక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ చౌరస్తాను అభివృద్ధి చేసినా.. ప్రధానంగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో రాత్రి అయితే ఇక్కడ చౌరస్తా మొత్తం చీకటిమయంగా మారుతుంది. ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియకపోవడంతో చాలాసార్లు ప్రమాదాలు జరిగాయి. రాత్రి అయితే చాలు ఇక్కడ ప్రమాదాలకు నిలయంగా మారింది. చౌరస్తా విస్తరణ జరిగినా, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

ముబారక్ నగర్‌లోని సుభ్‌జిత్ ఫ్యాక్టరీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ లేదు. ఇటీవల ఈ దారిలో డివైడర్ నిర్మాణాలు చేపట్టారు. కానీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకాకపోవడంతో చీకటిమయంగా మారింది. ముఖ్యంగా సుభ్‌జిత్ ఫ్యాక్టరీ ముందు డివైడర్ నిర్మాణం అక్కడికే నిలిచిపోయింది. దీంతో ఇక్కడ చీకట్లో డివైడర్ కనబడకపోవడంతో మూలమలుపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు తరచూ ఢీకొని, ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల బొలేరో వాహనం వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. గతంలో ఓ ఆటో, ఓ కారు కూడా చీకట్లో డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడ్డాయి. ఈప్రమాదాల్లో కొన్నిసార్లు ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పాలకులు స్పందించి తక్షణమే సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



ముబారక్‌నగర్ నుంచి లక్ష్మీప్రియనగర్ వరకు రహదారిపై వీధిదీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంటుంది. దీంతో ఇక్కడ తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ పనులు కూడా నత్తనడకన జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, వెంటనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

–అజయ్, నిజామాబాద్

దోషులను కఠినంగా శిక్షించాలి



నగరంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు.. సిరికొండలో..

ఖలీల్‌వాడి: మణిపూర్‌లో అల్లర్లు, హింసకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి, దోషులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఈమేరకు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘ ప్రతినిధులు గోదావరి, సంధ్యారాణి, గణేష్, విఠల్, కిరణ్, మహిపాల్, లక్ష్మీకాంత్, లలిత, గంగాధర్, సాయి ఉన్నారు.

ప్రధాని రాజీనామా చేయాలి..

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటనకు పూర్తి బాధ్యత ప్రధాని నరేంద్ర మోదీ వహించి పదవికి రాజీనామా చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడీ భాగ్య డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్ గాజుల సుజాత, పద్మ, మల్లైకా బేగం, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటనకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం, పీఎం మోదీ రాజీనామా చేయాలని ఐద్వా మహిళా సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు నగరంలో కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు అనిత, ప్రధాన కార్యదర్శి సుజాత, లావణ్య, కళావతి, పుష్ప, సుబ్బలక్ష్మి, లలిత, లక్ష్మీ, రేఖ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి..

నిజామాబాద్‌అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు, మహిళలపై హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలో వారు దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. దీపిక, నీలిమ, మేఘన, సాధియ, షరీన్, లక్ష్మి, విగ్నేష్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తు సీపీఐఎంఎల్ ప్రజాపంథా, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు రామకృష్ణ, రమ, రమేష్, సాయారెడ్డి, అఫ్రోజ్, సుశీల, నాగన్న, సంజీవ్, దీపక్ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

క్లుప్తంగా

మొబైల్ ఈవీఎం వ్యాన్ల ప్రారంభం



డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి కేటాయించిన రెండు మొబైల్ ఈవీఎం ప్రదర్శన వాహనాలను శుక్రవారం డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ, జక్రాన్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌లలో మూడు నెలల పాటు ఈవీఎంల ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, అశ్విని, ఆర్ఐ సంతోష్, ఏఆర్ఐ భూపతిప్రభు, వీఆర్ఏ లు తదితరులు పాల్గొన్నారు.

నిధుల ప్రొసీడింగ్ పత్రాల అందజేత



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన సంఘ సభ్యులకు నిధుల మంజూరు పత్రాన్ని అందజేశారు.

నిధుల మంజూరుపై హర్షం

ఇందల్వాయి: మండలంలోని వెంగల్‌పాడ్–నల్లవెల్లి గ్రామాల మధ్య 5కి.మీ బీటీ రోడ్డు పునరుద్ధరణకు పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ. కోటి ముప్పై లక్షలు మంజూరైనట్లు వైస్ ఎంపీపీ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి



జక్రాన్‌పల్లి: ఓటరు జాబితా సవరణను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో నటరాజ్ సూచించారు. మండలకేంద్రంలో శుక్రవారం ఓటరు జాబితా సవరణపై ఆయన బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో తప్పొప్పులు లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ మల్లేష్, ధర్పల్లి ఎంపీడీవో లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేరస్తులు తప్పించుకోకుండా విచారణ జరగాలి



ఖలీల్‌వాడి: నేరం చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకునే వీలులేకుండా నేర విచారణ జరగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. నగరంలోని జీజీహెచ్‌లో శుక్రవారం పోక్సో చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలలపై లైంగిక దాడులు జరిగిన సందర్భంలో వారి మెడికల్ సాక్ష్యం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కన్విక్షన్ రేటు పెరిగితే నేరాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. పోక్సో చట్టంపై విస్తృత అవగాహన కోసం జిల్లాలో లఘుచిత్రం చిత్రీకరణ జరుపుకుంటున్నదని వివరించారు. ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ తరపున పోక్సో కేసుల నేర విచారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విచారణ పూర్తి చేస్తామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సలహాదారు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అభినందన



నిజామాబాద్‌నాగారం: కరాటేలో రాణిస్తున్న ఎడ్ల సిరిచందన, ఎడ్ల రిత్విక్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం అభినందించారు. ఇంటర్నేషనల్ కరాటే బస్లీ అవార్డు గ్రహీత, నిజామాబాద్ జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎడ్ల వెంకటేష్ మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ఇటీవల కరాటే గ్లోబల్ వరల్డ్ రికార్డ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన సిరిచందన, రిత్విక్‌ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోపాల్‌లో వర్షంలోనూ సమ్మె కొనసాగిస్తున్న జీపీ కార్మికులు.. జక్రాన్‌పల్లిలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్)/ఖలీల్‌వాడి/జక్రాన్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, 16 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. మోపాల్ మండలకేంద్రంలో జీపీ కార్మికులు, కారోబార్లు చేపట్టిన సమ్మె శుక్రవారం వర్షంలోనూ కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జీపీ కార్మికులు సమ్మెలో భాగంగా వర్షంలోనూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్మిక సంఘ నాయకులు, వివిధ గ్రామాల జీపీ కార్మికులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ


నిండుకుండలా సిరికొండలోని ఎల్లమ్మ చెరువు


అలుగు పారుతున్న కొండాపూర్ ఊర చెరువు


ముల్లంగి చెరువు అలుగుపై యువకుల సందడి

సిరికొండ/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి/నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. సిరికొండ, డిచ్‌పల్లి మండలాల్లోని చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి.

జక్రాన్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లు వర్షాలకు ధ్వంసమయ్యాయి. అలాగే నిజామాబాద్‌లోని 12వ వార్డులోగల సాగర్‌హిల్స్ ప్రాంతంలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాలను కాంగ్రెస్ నేత బాడ్సి శేఖర్‌గౌడ్, మైనార్టీ నేత సయ్యద్‌ఖైసర్ పరిశీలించారు. అలాగే తుల్జా భవానినగర్ నీటమునిగింది. కాలనీలో మురుగు నీరు బయటకు వెళ్లేందుకు కనీసం డ్రెయినేజీలు లేకపోవటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సాగర్‌హిల్స్‌లో బాధితులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. నీట మునిగిన భవానీనగర్ కాలనీ

నియామకం...



డిచ్‌పల్లి/ఇందల్వాయి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ఇందల్వాయి మాజీ సర్పంచ్ పాశం కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం పాశంకుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఎమ్మెల్యేకు, ధర్పల్లి జెడ్పీటీసీ జగన్‌కు, పార్టీ నాయకులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఇందల్వాయి ఎంపీపీ రమేష్‌నాయక్, పార్టీ నాయకులు శెట్టి బీరేష్, రాజునాయక్, రవీందర్‌నాయక్ తదితరులు కుమార్‌ను అభినందించారు.

జిల్లా గౌడ సంఘం..



నిజామాబాద్ సిటీ: జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా తాళ్ళ మధుసూదన్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా గౌడ సంఘం, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ శుక్రవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

మెప్మా ఇన్‌చార్జి పీడీగా..



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీగా మాధురిలత శుక్రవారం ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మెప్మా పీడీ సత్యనారాయణ బదిలీపై హైదరాబాద్ వెళ్లడంతో ఆమె ఇన్‌చార్జీ పీడీగా బాధ్యతలు చేపట్టారు.

పీవీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



నిజామాబాద్ సిటీ: బోర్గాం(పీ) చౌరస్తాలో ఆగస్టు 2న నిర్వహించనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహరావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాలను తెలంగాణ బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ శర్మ, కోశాధికారి పుల్కల్ రమేష్ కులకర్ణి, కో ఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్లను తొలగించడం సరికాదు



సుభాష్‌నగర్: జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను తొలగించడం సరికాదని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్‌కుమార్, జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారని, వీరని త్రీమెన్ కమిటీ నియమించిందని తెలిపారు. ఇటీవలే ప్రభుత్వం జీవో 1145 విడుదల చేసి అందరినీ కొనసాగించాలని.. లేదా రెన్యూవల్ చేయాలని ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. అయినా విద్యాశాఖ కమిషనర్ ఏకపక్షంగా అందరినీ తొలగించారని, పీజీలో మెరిట్ ఆధారంగా తిరిగి గెస్ట్ లెక్చరర్ల నియామకాలు చేపడుతామని ప్రకటించారని తెలిపారు. సీఎం కేసీఆర్ స్పందించి అందరినీ కొనసాగించాలని కోరారు. నాయకులు మనోజ్, భాస్కర్, దేవిక ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కోసం మిస్డ్‌కాల్ ఉద్యమం

బోధన్: మూతపడ్డ బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలనే డిమాండ్‌తో మిస్డ్‌కాల్ ఉద్యమం చేపట్టినట్లు బీజేపీ నాయకుడు, న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. 8447369369 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,050	వెండి (కిలో)	77,600
22 క్యారెట్స్	56,286		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	100	130	గాజరుగడ్డ	35	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	70	100
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	17	30
బీర్నీసుకాయ	70	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	35	60	గోబిపువ్వు	35	50
వంకాయ	15	30	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	60	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	60	80			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఓపెన్‌హైమీ(ఇంగ్లీష్)2డీ-10.00, 7.00,10.30 – హత్య(తెలుగు)-1.40, హిడింబ(తెలుగు)-4.20
స్క్రీన్-2	బేబి-2023(తెలుగు)-10.00, ఓపెన్‌హైమీ(ఇంగ్లీష్)2డీ-1.10, హిడింబ(తెలుగు)-7.40, కాజల్ కార్తీక(తెలుగు)-10.35
స్క్రీన్-3	హిడింబ(తెలుగు)-10.20, ఓపెన్‌హైమీ(ఇంగ్లీష్)2డీ-4.00, బేబి-2023(తెలుగు)-1.00,7.30, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	బార్బీ(ఇంగ్లీష్)-10.35, హెర్‌చాప్టర్-1(తెలుగు)-1.15, బేబి(తెలుగు)- 3.40,7.10, 10.40
స్క్రీన్-2	ఓపెన్‌హైమీ(ఇంగ్లీష్)-10.30,2.30, 6.30,10.30
స్క్రీన్-3	బేబి(తెలుగు)-10.40, బార్బీ(ఇంగ్లీష్)-2.10,7.40, అన్నపూర్ణ ఫొటో స్టూడియో(తెలుగు)-4.50, మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్)-10.20
స్క్రీన్-4	హత్య(తెలుగు)-10.50 7.30, సామజవరగమన(తెలుగు)-1.35, హిడింబ(తెలుగు)-4.35 10.15
దేవి	మహావీరుడు(తెలుగు)
నటరాజ్	హత్య(తెలుగు)
లలితామహల్	సామజవరగమన(తెలుగు)
విజయ్	బేబి

సంక్షిప్తం

నూతన అదనపు కలెక్టర్‌కు సన్మానం



ఖలీల్‌వాడి: జిల్లా అదనపు కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన యాదిరెడ్డిని శుక్రవారం ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు కలిసి సన్మానం చేశారు. నాయకులు గడ్కోల్ సంజీవ్ రెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

సుభాష్‌నగర్: అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన యాదిరెడ్డిని తన ఛాంబర్‌లో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయవార్ రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం యాదిరెడ్డిని ఆయన సన్మానించారు.

మహిళా ఎస్సైకి..

ఖలీల్‌వాడి: నగరంలోని మహిళ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై పద్మను మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం సన్మానం చేశారు. మహిళలు జ్యోతి, వీణ, రాణి, గీత, సరిత ఉన్నారు.

సిరికొండ ఎస్సైకి..



సిరికొండ: సిరికొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను శుక్రవారం పలువురు నాయకులు సన్మానించారు. గడీల శ్రీనివాస్, అఖిల్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

ఏటీఎస్ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

నిజామాబాద్‌నాగారం: సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని జిల్లా పరిషత్‌హాల్‌లో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, శ్రీనివాస్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

వృద్ధాశ్రమంలో అన్నదానం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం రైతు సమన్వయ కన్వీనర్ దివంగత బొల్లంక గంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం శాస్త్రీనగర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సర్పంచ్ వారం లక్ష్మన్‌రావు, సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.